

చంద్రబాబును కలిసిన గంటా నరహరి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కుప్పం నియోజకవర్గంలో మూడు రోజులపాటు పర్యటన నిమిత్తం బుధవారం బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును రాజంపేట టిడిపి పార్లమెంటు అభ్యర్థి గంటా నరహరి విమానాశ్రయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ మదనపల్లి మాజీ శాసనసభ్యులు శంకర్ యాదవ్ ఇంటికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో పార్టీని ముందుకు తీసుకుపోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పార్లమెంటు తోపాటు అన్ని నియోజకవర్గాలలోనూ పార్టీని గెలిపించే విధంగా కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు గంటా నరహరి తెలియజేశారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నరహరి

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృషి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ గిరీష అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి విసి ద్వారా సిఎం జగన్ మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం, అర్జీలు, గడప గడపకూ మన ప్రభుత్వం, ఎన్ఆర్ఇజిఎస్ పనుల పురోగతి, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్య క్రమంలో భాగంగా గృహనిర్మాణ పథకం అమలు తీరు, జగనన్న భూ హక్కు-భూ రక్ష పథకం, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, సచివాలయ సేవలు తదితర అంశాల్లో ఇప్పటి వరకు సాధించిన పురోగతి మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. విసి అనంతరం కలెక్టర్ అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విధిగా లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఈ నెల 23 నుంచి నెలపాటు జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. జగనన్నకు చెబుదాం వచ్చే వినతుల పరిష్కారంలో క్వాలిటీ అన్నది చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సేవలు అందించడంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పుతున్నామన్నారు. ఒకవేళ గ్రీవెన్స్ రిజెక్ట్ చేస్తే సంబంధిత ఫిర్యాదుదారు ఇంటికి వెళ్లి ఎందుకు రిజెక్షన్ గురైందో వారికి వివరించాలన్నారు. పరిశీలించని గ్రీవెన్స్ ఏమైనా ఉంటే 24 గంటల్లోగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా ఈ కార్యక్రమం కొనసాగనుందన్నారు. సచివాలయాలు, ఆర్‌బికెలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ గ్రంథాలయాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొరత రాకుండా చూడాలన్నారు. జులై ఒకటి నుంచి ఇ-క్రాఫ్ బుకింగ్ ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారానికి పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ నెలకొరుగా తుది జాబితాలను గ్రామ సచివాలయంలో ప్రదర్శించాలన్నారు. సిసిఆర్సి కార్డులపై అవగాహన కల్పించి కౌలు రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి ఫేజ్ లో 2 వేల గ్రామాల్లో జగనన్న భూహక్కు భూ రక్ష కార్యక్రమం పూర్తయిందిన్నారు. సచివాలయ స్థాయిలోని రిజిస్ట్రేషన్ సహా అన్ని రకాల సేవలు వీరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో దశ కింద మరో రెండు వేల గ్రామాల్లో సెప్టెంబర్ 30 కల్లా భూపత్రాలు అందాలిన్నారు. అక్టోబర్ 15 నుంచి ఇక్కడ రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభం కావాలన్నారు. జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం పనులు, బిల్లుల అప్లోడ్, ఎంజిఎన్ఆర్ఈజిఎస్ పనులు, లేబర్ బడ్జెట్, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఎఎంసియులు, బిఎంసియులు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల భవన నిర్మాణాలు, జగనన్న హౌసింగ్ ప్రోగ్రాం, వ్యవసాయం, నీటి విడుదల, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో పనిదినాలను ప్రభుత్వ లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కార్యక్రమంలో ఎస్‌పి గంగాధర్‌రావు, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, అదనపు ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, సిపిఒ కృష్ణనాయక్, హౌసింగ్ పీడీ శివయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్, ఇరిగేషన్ జిల్లా అధికారి కృష్ణమూర్తి, డ్రామా పీడీ మద్దిలేటి, పిఆర్ఎస్‌టి జయచంద్ర, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, వివిధ శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

కాంటాక్ట్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు ఎరపరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మాసాపేట బ్రిడ్జి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఉద్యోగస్తుల సమస్యలపైన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిజిఇఎ ఆధ్వర్యంలో సమస్యలు పరిస్కారం కోసం ఈ నెల 22 నుండి చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దార్లు, సిపిఎస్, కాంట్రాక్టు, కంటింజెంటు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక, ప్రస్తుత సమస్యల పరిస్కారానికి, హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం చేస్తున్నమన్నారు. ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు సూర్యనారాయణ, ఆస్కారరావు ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు పరిరక్షింప బడాలని, సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ ఇవ్వాలిన్నారు. ప్రతి నేల1వ తేదీనే జీతాలు,పింఛన్లు ఇవ్వాలిని డిమాండ్ చేశారు. 2019 వరకు నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కంటింజెంటు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవాలన్నారు. డిఎలు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని, పిఆర్‌సి కమిషన్‌తో సంబంధం లేకుండా 11వ పిఆర్ సివిధముగానే అధికారుల కమిటీ వేసి 12వపి ఆర్‌సిని ప్రకటించాలిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఓసాయి కుమార్, కార్యదర్శి సుజిత్,ఉపాధ్యక్షులు శ్రీనివాసులు నాయక్, వెంకట రమణ, సంయుక్త కార్యదర్శి వలి, శివ రాజశేఖర్, సదాశివరెడ్డి తాలుకా అధ్యక్షులు సిద్ది రామయ్య, ట్రెజరర్ సాదక్, సభ్యుడు యోగాంజులరెడ్డి పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

'కొప్పర్తి' పైప్‌లైన్‌పై కమిటీ



నిరుపయోగంగా ఉన్న పైపులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సోమశిల నుంచి కొప్పర్తి నీటి సరఫరా పైప్‌లైన్ పైపుల తరలింపునకు రంగం సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలోని రూ.450 కోట్లు పైప్‌లైన్ పనులకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పైప్‌లైన్ అలైన్‌మెంట్ పొడవునా 2.4 డయాఫ్రమ్ వాల్ సామర్థ్యంతో కూడిన పనులను ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ అనంతర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పైప్‌లైన్ పనుల్లో కదలిక లేకుండా పోయింది. ఇటీవలి కాలంలో కొప్పర్తి పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పెరిగిన నేపథ్యంలో వృథాగా పడి ఉన్న పైప్‌లైన్ పైపులను ఇతర

ఇంజినీరింగ్ నిపుణులతో అధ్యయనం
బ్రహ్మసాగర్ నీటి సరఫరా పనులకు మళ్లింపు?!

ప్రాంతాలకు తరలించాలనే ఉద్దేశంతో ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ, కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ ఇంజినీర్, జాయింట్ కలెక్టర్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇంజినీరింగ్ ఇన్‌ఛీఫ్ నారాయణరెడ్డి సోమశిల ఎత్తిపోతల పనులను పరిశీలించినట్లు తెలిసింది. కొప్పర్తి పారిశ్రామికవాడకు పరిశ్రమల తాకిడి పెరిగిన నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం నీటి సరఫరా కల్ప నపై దృష్టి సారించింది. 33 కిలోమీటర్ల మేర 800 మిల్లీమీటర్ల డయా మీటర్ల వ్యాసార్థం కలగిన పైప్‌లైన్‌ల ద్వారా 480 మిలియన్ లీటర్ ఫర్‌డే (ఎంఎల్‌డి) నీటిని సరఫరా నిమిత్తం రూపకల్పన చేయడం తెలిసిందే. ఇందులో 1460 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన సమ్మర్ స్టోరేజీ సంప్ పను లను చేపట్టనున్నట్లు తెలుస్తోంది. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్ నుంచి ఆర్‌టిపిపికి పైప్‌లైన్‌లతో నీటిని సర ఫరా చేయాలని ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆర్‌టిపిపితో అవగాహన కుదుర్చుకుని తాత్కాలిక ప్రాతిపదికన నీటి సరఫరా పైప్‌లైన్‌కు సోమశిల ఎత్తిపోతల పనుల పైపులను తరలించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒంటిమిట్ట అవతలి ప్రాంతం నుంచి కడప జిల్లా కేంద్రానికి సమీపం వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవునా నిరుపయోగంగా పడి ఉన్న ఖరీదైన పైపులను ఉపయోగంలోకి వస్తే ప్రజాధనాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉండేదని చెప్పవచ్చు. దీనిపై ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ శ్రీనివాసులను ఫోన్‌లో పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.



కేశాలు దానం చేసున్న చిన్నారులు

కేన్సర్ రోగులకు కేశదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. బుధవారం మదనపల్లి 22వ వార్డు కౌన్సిలర్ ముబీనా కుమార్తె అర్ఫా అంజూమ్, మదనపల్లి ఎస్టేట్‌కు చెందిన రేనా, నిమ్మనపల్లికు చెందిన పావని హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి తమ కేశాలను దానం చేశారు. వీరికి ప్రశంస పత్రంతోపాటు పూలమొక్కలు బహుకరించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ వయసులో చిన్న వారైనా సేవా గుణంలో గొప్ప మనసును చాటుకుంటూ చిన్నారులు, యువతులు కేశాలు దానం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇప్పటికే 30 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేసారని, రాష్ట్ర వ్యాప్తంగా కేన్సర్ బాధితులకు ఎవరికైనా విగ్గులు కావాలంటే తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు.

పాలకులకు రాజంపేట అభివృద్ధి పట్టదా?

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఓట్లు, సీట్లు తప్ప పాలకులకు రాజంపేట నియోజకవర్గ అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని, అధికారం కోసం పాకులాడే పార్టీలన్నీ రాజంపేట నియోజకవర్గ అభివృద్ధి పట్టడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. బుధవారం స్థానిక రాజంపేటలోని ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నందలూరు ప్రాంతంలో గతంలో బ్రిటిష్ పాలకులు ఏర్పాటు చేసిన రైల్వే లోకో షెడ్ మూసివేసినా, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఏర్పాటు చేసిన నందలూరు ఆల్విన్ పరిశ్రమ మూసివేసినా వాటి స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేయడంలో గానీ, నూతనంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏ ఒక్కరూ కృషి చేయడం లేదని అన్నారు. నందలూరు ఆల్విన్ పరిశ్రమ స్థానంలో మరొక పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కొనుగోలు చేసి ఇంతవరకు ఎటువంటి పరిశ్రమ నిర్మించకపోయినా ప్రభుత్వం ఆ స్థలాన్ని ఎందుకు స్వాధీనం చేసుకొని ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, నియోజకవర్గ కార్య దర్శి ఎం.శివరామకృష్ణదేవరా, సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి సికిందర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సమాజంలో అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న అని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్ట్రియా దేశానికి చెందిన కార్ల్ లేండర్ స్టీనర్ రక్తంలోని ఎ, బి, ఓ అనే గ్రూపులున్నట్లు 1901లో కనిపెట్టారన్నారు. కార్ల్ లేండ్ స్టీనర్‌ని ఆధునిక రక్తమార్పిడి మూల పురుషునిగా పరిగణిస్తారన్నారు. అతని జ్ఞాపకార్థం అతని పుట్టిన రోజైన జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుతున్నారని తెలిపారు. ప్రమాదాలు, శస్త్ర చికిత్సలు, ప్రసవం మొదలగు సమయాలల్లో రక్తం అత్యవస రమవుతుందని, అందువలన ప్రాణాలు నిలిపేందుకు ఎవరైనా రక్తదానం చేయటమే మార్గమన్నారు. ఆరోగ్యవంతుడు 3నెలలకోసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానం చేసిన రక్తం తిరిగి 36గంటల్లో భర్తీ అవుతుందన్నారు. 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సుండి 45 కిలోల పైన బరువు ఉన్న ఆరోగ్యవంతులెవరైనా రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, నర్సులు గోవిందమ్మ, లావణ్య, షబానా, సిబ్బంది బాబా ఫకృద్దీన్, సుధాకర్, భాస్కర, నవీన్, నరేంద్ర పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న జెవివి అధ్యక్షుడు ప్రభుచరణ్



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ఇఎపిసెట్‌లో కృష్ణారెడ్డి సిద్దార్థ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన ఇఎపిసెట్ ఫలితాలలో స్థానిక ప్రశాంత్ నగర్ లోని శ్రీకృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించి మదనపల్లె పట్టణంలోని అత్యున్నత ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో ఎ.హర్షిణిప్రియ 3445 ర్యాంకు, ఎస్.కీర్తన 5502 ర్యాంకు, చందు శ్రీ 8247 ర్యాంకు, బి మెర్లిన్ మదోన్న 8503 ర్యాంకు, ఎం.బాలాజీ 9423 ర్యాంకు, ఎస్. హర్షిత 10810 ర్యాంకు, ఎస్.లక్ష్మి సాసర్ 11102 ర్యాంకు, ఎస్ హిమబిందు 11278 ర్యాంకు, కె.రెడ్డి లోకేష్ 11800 ర్యాంకు, ఎస్.దీప 12172 ర్యాంకు, ఎ.శ్రీచరని 13259 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను, అధ్యాపకులను అభినందించారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యాశాఖ ఆదేశాలను అమలు చేయని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ పేర్కొన్నారు. బుధవారం రాజంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలకు వేలు అక్రమంగా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్త మాంసాలతో వ్యాపారం చేస్తున్నారన్నారు. విద్యను దుకాణాల్లో సరుకుల్లా కేజీల ప్రకారం అమ్మకానికి పెట్టి అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న ప్రవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల పైన జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో 25 శాతం ఉచిత విద్యను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విద్యా శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎ రాజంపేట నాయకులు సుందర్, కార్తీక్, మహమ్మద్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

నీట్‌లో గురుశేఖర్‌రెడ్డికి 68వ ర్యాంక్

ప్రజాశక్తి - చాపాడు

నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో మండల పరిధిలోని మడూరు గ్రామానికి చెందిన దేవగుడి గురుశేఖర్‌రెడ్డి 720/710 మార్కులు సాధించి 68వ ర్యాంక్ సాధించాడు. ఇంటర్మీడియట్‌లో బైపిపిలో 988 మార్కులు సాధించాడు. గురుశేఖర్‌రెడ్డి రైతు కుటుంబానికి చెందిన మల్లేశ్వర్‌రెడ్డి కుమారుడు. గురుశేఖర్ రెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 68వ ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.



డైరెక్టర్ రాజారెడ్డి, డిపో మేనేజర్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

జిపిఎస్ ఆమోదంపై వైఎస్ఆర్ఇఎఫ్ హర్షం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర క్యాబినెట్ జిపిఎస్‌ను ఆమోదించినందుకు పిటిడి వైఎస్ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం పీలేరు ఆర్టీసీ డిపో వద్ద పిటిడి వైఎస్ఆర్ఇఎఫ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిపిఎస్‌కు క్యాబినెట్ ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ఉద్యోగులకు భద్రత, భరోసా సాధ్యమవుతోందని పేర్కొన్నారు. అనంతరం వారు ప్రజా రవాణా సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఎ.రాజారెడ్డి, పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతాపూర్వకంగా సత్కరించారు. కార్యక్రమంలో పిటిడి వైఎస్ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. దేవరాజులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉప ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి రవిశంకర్, రాష్ట్ర కార్యదర్శి గోవిందు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు టి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బి.రామ్మోహన్ రావు, తిరుపతి జిల్లా కార్యదర్శి, జంపాల వెంకటేశ్వర్లు, తిరుమల అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, చంద్రశేఖర్, పీలేరు డిపో అధ్యక్ష కార్యదర్శులు, ఆర్.వి.రమణ పాల్గొన్నారు.



సివిల్స్ ర్యాంకర్ పవన్ దత్తాను సన్మానిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

సివిల్స్ ర్యాంకర్ పవన్ దత్తాకు సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇటీవల ప్రకటించిన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 22వ జాతీయ ర్యాంకు సాధించిన పవన్ దత్తా ఎల్ఐసి కుటుంబ సభ్యులు కావడం తమకు గర్వకారణమని కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. బుధవారం డివిజనల్ కార్యాలయంలో హైదరాబాద్ జోనల్ కార్యాలయ ప్రతినిధి, ఆఫీస్ సేవల కార్యదర్శి సూర్యనారాయణతో కలిసి ఆయన సివిల్స్ విజేతను అభినందించారు. రాజంపేట ఎల్ఐసి శాఖలో పాలనాధికారిగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లు తనయుడు పవన్ దత్తా వైద్య వృత్తిలో ఉన్న అసాధారణమైన అవకాశాలను వదులుకొని ప్రజలకు, సమాజానికి, దేశానికి ఒక ఐఎఎస్ అధికారిగా మిన్నగా సేవలు చేయొచ్చన్న ఉదాత్తమైన తలంపుతో ఐఎఎస్‌ను కెరీర్‌గా ఎంచుకోవడం ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పవన్ దత్తా మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ తమ కుటుంబానికి జీవితంలో ఎన్నో అవకాశాలు ఇచ్చిందని, తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరు కోవడం సాధ్యమైందని అన్నారు. భారతదేశం అమృత్ కాల్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో, అనేక సంస్కరణలు అన్ని రంగాల్లో చోటు చేసుకుంటాయన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా మనం రూపాంతరం చెందాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు చంద్రపాల్, రఘునాథరెడ్డి, ఆనందరావు తదితరులు పవన్ దత్తా సాధించిన విజయాన్ని అభినందిస్తూ మాట్లాడారు. కార్యక్రమంలో పవన్ దత్తా తండ్రి జి.వెంకటేశ్వర్లు, సోదరుడు కార్తవీర్య, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్, ఇతర మేనేజర్లు సత్య ప్రసాద్, అధికారులు లక్ష్మీనారాయణరెడ్డి, మునెయ్య పాల్గొన్నారు.

బిజెపి, వైసిపి రెండు దొంగ పార్టీలే : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

బిజెపి, వైసిపి రెండు దొంగ పార్టీలేనని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జగన్ పాలనలో అవినీతి తప్ప మరేమీ కనిపించటం లేదన్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై జగన్ బొమ్మ వేసుకొని సొంత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల కోట్లు ఇచ్చినా డబ్బుకు సరిపడా అభివృద్ధి లేదని, వైసీపీ నాయకులకు భూరాబంధుల కేంద్రంగా ఏపీ ప్రభుత్వం తయారైందని అన్నారన్నారు. ఇంత తీవ్రంగా విమర్శించినా తేలు కుట్టిన దొంగల్లాగా వైసిపి నాయకులు ఈ ఆరోపణలను ఖండి స్తూ ఒక్క మాట కూడా ఎవరూ మాట్లాడలేదని పేర్కొన్నారు. బిజెపి, వైసిపి రెండు పార్టీల ప్రభుత్వాలు దొంగలే అన్న విషయం ప్రజలకు సుస్పష్టమవుతోందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య

'బ్రౌన్'కు రూపమిచ్చిన మేటి 'మైనంపాటి'

-వైవీయూ విసి చింతా సుధాకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

సి.పి.బ్రౌన్‌కు చెందిన అనేక విషయాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఆయన చిత్రం లభించకపోవడం తీరని లోటుగా ఉన్న సందర్భంలో బ్రౌన్ ఊహాచిత్రాన్ని గీసి ఆయనకు రూపమిచ్చిన మేటి చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవి ద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బుధవారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో సి.పి.బ్రౌన్ ఊహాచిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం 13వ వర్ధంతిని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ చిత్రపటం గానీ, ఛాయాచిత్రం గానీ ఎందువల్లనో లభించలేదని, బ్రౌన్ చిత్రం లభించలేదనే కొరత సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయం వ్యవస్థాపకులు జానమద్ది హనుమచ్ఛాస్త్రినే కాక తెలుగువాళ్ళందరిని బాధించిందని అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ మైనంపాటి 'నన్నయభట్టు', 'అల్లరిపిల్ల'(వరూధిని), 'సుగాలి రాముడు'(మట్లిరాజు) అనే చారిత్రక నవలలను, 'విజయశ్రీ' అనే శివాజీ నాటకాన్ని, 'తాళిబొట్టు', 'పల్లెసీమ' వంటి నాటికలను, 'అరణ్యరోదన'మనే గేయాన్ని రచించారని అన్నారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘ సభ్యులు తవ్వా వెంకటయ్య, గ్రంథపాలకులు ఎన్.రమేష్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, లలిత కళల విభాగం అకడమిక్ కన్సల్టెంట్ డా? కొప్పోలు రెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మైనంపాటికి నివాళులర్పిస్తున్న అధికారులు



ఇంటింటికి నల్లారి కార్యక్రమంలో కిషోర్‌కుమార్‌రెడ్డి

ఆదరించండి..అభివృద్ధి చేస్తా : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

ఆదరించండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రజలను కోరారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఇంటింటికి నల్లారి కార్యక్రమం బుధవారం నాలుగో రోజున కలికిరి పట్టణంలోని కట్ట కిందపాలెం, కొత్తపేట, టీవీ రోడ్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కాలనీలో నిర్వహించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం, రూ.3వేలు నిరుద్యోగ భృతి, 18 సంవత్సరాల నిండిన మహిళలకు నెలకు రూ.1500లు, రైతులకు రూ.20వేలు ఆర్థిక సహాయం, మహిళలకు సంవత్సరానికి మూడు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు వంటి ప్రజా సంక్షేమ పథకాలే కాకుండా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తాం అన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగేటట్లు చర్యలు తీసుకుంటానని వారికి హామీ నిచ్చారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాపకుమార్‌రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, టీ షాప్ బుజ్జి, 203బూత్ కమిటీ కన్వీనర్ వైజాగ్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబిశెట్టిపల్లి రోడ్డుకు మహర్దశ

- రూ.1.10 కోట్లతో తారురోడ్డు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని బడికాయలపల్లి పంచాయతీ పరిధిలోని ఓబిశెట్టిపల్లికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో రూ.1.10కోట్ల వ్యయంతో తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు నిర్మాణం కోసం గతంలో ఎన్నో మార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి రూ.1.10కోట్ల వ్యయంతో తారురోడ్డు నిర్మాణాన్ని చేపట్టారని అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిల కృషితో బడికాయలపల్లి స్టేట్ బోర్డర్ నుంచి ఓబిశెట్టిపల్లి వరకు తారు రోడ్డు వేసినందున ఓబిశెట్టిపల్లి రమేష్, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ఓబిశెట్టిపల్లె వేస్తున్న తారురోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రం చిన్నమండెం సమీపంలోని రహదారిపై ఇనుప కరెంటు స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని వంగి పోయి నెలరోజులు కావస్తున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. అనునిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేయించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వంగిపోయిన విద్యుత్ స్తంభం

ఎంపిడిఒగా పరమేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కలకడ

కలకడ ఎంపిడిఒగా పరమేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న సి.హెచ్.నారాయణ పుంగనూరుకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి కలికిరి ఎంపిడిఒ గంగయ్య ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరులో ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇందుకోసం ప్రతి అధికారి తనకు సహకరించి మండల అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఎంపిడిఒగా పరమేశ్వర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో ఎంపిపి శ్రీవిద్య రవికుమార్ స్వాగతం పలికారు. ఆయనను పూలమాలలో దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, ఎంఇఒ మునిరెడ్డినాయక్, ఎపిఒ చెన్నకేశవులు, మండలస్థాయి అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్వర్‌రెడ్డి

నిమ్మనపల్లి ఎంపిడిఒగా శేషగిరిరావు

నిమ్మనపల్లి : నిమ్మనపల్లి నూతన ఎంపిడిఒగా శేషగిరిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా పనిచేస్తున్న లీలామాధవ పదోన్నతి పై చిత్తూరు జిల్లా నగరికి బదిలీ కావడంతో, నగరి ఎంపిడిఒ కార్యాలయంలో ఎఓగా పని చేస్తున్న శేషగిరిరావు పదోన్నతి పొంది బదిలీపై వచ్చారు. అనంతరం ఎంపిపి నరసింహులు, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, వెంకటరమణారెడ్డి, మంజుల, ఎర్రమలయ్య నాయుడులు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

19 నుంచి ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

రైల్వేకోడూరు : రైల్వే కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరం అడ్మిషన్లు ఈ నెల 19 నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రక్రియకు సంబంధించి ఈ నెల 19 నుంచి 24 వరకు విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాల హెల్ప్‌డెస్క్ లేదా 94404 70022 ఫోన్ నంబరును సంప్రదించాలని తెలిపారు.

నిమ్మనపల్లి ఇఒపిఆర్‌డిగా చలపతిరావు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నూతన పంచాయతీరాజ్ శాఖ విస్తరణ అధికారిగా చలపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన రామసముద్రంలో పని చేస్తూ సాధారణ బదిలీలో భాగంగా నిమ్మనపల్లి మండలానికి వచ్చారు. స్థానిక ఎంపిడిఒ శేషగిరిరావును కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, వెంకటరమణారెడ్డి, మంజుల, ఎర్రమలయ్య నాయుడులు ఆయనకు కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఆర్థికాభివృద్ధితోనే పేదరిక నిర్మూలన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మహిళా సంఘ సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధించినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఎపిఎం రాజన్న తెలిపారు. క్రైస్ట్ భవన్‌లో బుధవారం రెండవ రోజు సంఘమిత్రలు, మండల సమాఖ్య సభ్యులకు అభివృద్ధి నిధుల ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాటిని వినియోగించుకోవడం, ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలలో స్థానిక వనరుల ఆధారంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏపిఎంలు రమేష్, ఎం.సి. అధ్యక్షురాలు కుమారమ్మ, సిసిలు భవానీశంకర్, రమణ, తులసి పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి : ఎపిడి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డ్వామా ఎపిడి రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ భవనం ఆవరణంలో 2022-23 సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా వివిధ శాఖలలో 1836 పనులకు రూ.4.22 కోట్లను ఖర్చు చేసిన దానిపై 17వ సామాజిక తనిఖీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 లో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా చేసిన ఉపాధి హామీ పనులను, ఇతర శాఖలో చేసిన పనులను సామాజిక తనిఖీ బృందం ప్రతి పంచాయతీలోనూ ప్రతి పనిని పది రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన పనులను పరిశీలించి వాటిలోని లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. వెంగంవారిపల్లి పంచాయతీలో మామిడి మొక్కలు నాటుకున్న రైతుకు చెల్లించాల్సిన బిల్లును వేరొకరికి చెల్లించినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించి, తెలపడంతో ఎపిడి ఉపాధి హామీ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ లైబ్రరీకి సంబంధించిన సిమెంట్ బస్తాలను కాంట్రాక్టర్ ఇతర భవన నిర్మాణాలకు ఉపయోగించడంపై సరైన రికార్డులను సిబ్బంది అందించకపోవడంతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారి పనితీరు మెరుగు పరుచుకునేలా చర్యలు తీసుకోవాలని ఎపిఒ రమేష్ కు సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, పొరపాట్లు పునరావృతం కాకుండా సరిదిద్దుకోవాలని సిబ్బందికి సూచించారు. సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఉపాధి హామీ సిబ్బంది చేత రూ.7,514 లను రికవరీ చేయించి, రూ.22,000 లను అపరాధ రుసుముగా కట్టించారు. కార్యక్రమంలో ఎపిడి మధుబాబు, ఎంపిపి నరసింహులు, ఎంపిడిఒ శేషగిరిరావు, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్.ఐ.రమణారెడ్డి, ఎస్ఆర్‌పికె.భాస్కర్, ఎపిఒ రమేష్, డిఆర్‌పిలు పవన్, శివ కుమార్, నూతన్ పవన్, టిఎలు పద్మావతి, దివ్యభారతి, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది ద్వారా వివరాలు సేకరిస్తున్న డ్వామా ఎపిడి రవికుమార్

రైతులకు రాయితీ గడ్డి విత్తనాలు పంపిణీ



రాయితీ గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

పజాశక్తి-నిమ్మనపల్లి

పాడి రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీపై గడ్డి విత్తనాలను పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నట్లు ఎంపిపి నరసింహులు తెలిపారు. బుధవారం స్థానిక పశు వైద్యశాలలో పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ ఏర్పాటు చేసిన సబ్సిడీ గడ్డి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్.ఐ రమణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు గడ్డిని సాగు చేయటానికి గడ్డి విత్తనాలను 75 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. నిమ్మనపల్లి, రెడ్డివారిపల్లి పశువైద్య కేంద్రంలో, మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న, జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావలసిన రైతులు వారి ఆధార్‌కార్డును, ఆర్‌బికె కేంద్రాలలోని పశువైద్య సహాయకులకు అందించి గడ్డి విత్తనాలను పొందాలని తెలిపారు. పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై గడ్డి కత్తిరించు యంత్రాలను అందిస్తున్నాదని అన్నారు. ఒక్కొక్క యంత్రం విలువ రూ. 33,970లు కాగా 40 శాతం సబ్సిడీ రూ.13,588లు పోను మిగిలిన రూ.20,382 లకే అందిస్తోందని తెలిపారు.

గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు

ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని 38 వేల గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యాధికారి తెలిపారు. గొర్రెలు మేకలకు సరైన సమయంలో నట్టల నివారణ మందులను అందించడం ద్వారా వాటికి హాని కలిగించే వాటి శరీరంలోని అంతర ఫలాన్న జీవులను నశింప చేయటంతో అవి ఆరోగ్యంగా ఉంటాయన్నారు. గొర్రెలు, మేకలు పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, వైసిపి నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, పశు వైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రాజంపేట-ప్రజాశక్తి రూరల్

రక్తదానం ప్రాణదానంతో సమానమని, సమాజంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా రక్తదానం చేసి తీరాలని రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా బుధవారం రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే రక్త దానం ఒక నిండు ప్రాణాన్ని కాపాడినట్లు అవుతుందని అత్యవసర సమయాల్లో చాలామందికి అవసరమైన గ్రూపుకు సంబంధించిన రక్తం దొరకక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని యువత దృష్టిలో పెట్టుకొని రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. రక్తదాన శిబిరంలో సుమారు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ డిప్యూటీ డిఎంహెచ్ఒ చెన్నకృష్ణ, నోడల్ అధికారి డాక్టర్ శేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటనాగేశ్వరరావు, ఐసిటిసి కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, పిల్లిపిచ్చయ్య పాల్గొన్నారు. **బి.కొత్త కోట :** పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 63 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. కార్యక్రమంలో సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్, ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, లయన్స్ క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ సభ్యులు హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, సకల విశ్వనాథ్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట :** బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఒకేరోజులో అత్యధికంగా రక్తదానం చేసినందుకు జిల్లా బెస్ట్ ఇన్స్టిట్యూషన్ అవార్డును అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి.నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా వైఎస్ఆర్ కడప రెడ్‌క్రాస్ సంస్థ వారు ఈ అవార్డును ప్రకటించారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. అవార్డును ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎల్ ఓబులపతి స్వీకరించారని తెలిపారు. జిల్లా బెస్ట్ ఇన్స్టిట్యూషన్ అవార్డు అందజేసినందుకు కళాశాల యాజమాన్యం డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, కళాశాల చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్ రెడ్డిలు ఆనందం వ్యక్తం చేస్తూ ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను అభినందించారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి



అవార్డు అందుకుంటున్న అన్నమాచార్య ప్రతినిధులు



తల్లిదండ్రుల చేత ఒప్పంద పత్రం రాయించుకుంటున్న పోలీసులు

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసిడిఎస్ సిబ్బంది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి గ్రామపంచాయతీలో బుధవారం బాల్య వివాహాన్ని మండల స్థాయి అధికారులు, మహిళా పోలీసులు, ఐసిడిఎస్ సిబ్బంది అడ్డుకున్నారు. స్థానిక ఎస్ఐ రఘురాం, తహశీల్దార్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రుల చేత ఒప్పంద పత్రం రాయించి ఇచ్చారు. బాల్య వివాహాలను ఖండించాల్సిన తల్లిదండ్రులే ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదని ఎస్ఐ తెలిపారు. మరల బాలికకు వివాహ ప్రయత్నం చేస్తే తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు తప్పవని తహశీల్దార్ నరసింహ కుమార్ హెచ్చరించారు.

రైళ్లు నిలుపుదలపై ఐకెపిఎస్ హర్షం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో హరిప్రియ, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేస్తామంటూ రైల్వే శాఖ అధికారికంగా ప్రకటించడంతో స్థానిక ఐకెపిఎస్ నాయకులు, మండల ప్రజలు బిజెపి రాజంపేట పార్లమెంటరీ కన్వీనర్, రాష్ట్ర పొలిటికల్ ఫీడ్ బ్యాక్ కమిటీ సభ్యులు సాయి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రైల్వే శాఖ నుంచి అధికారికంగా ఆదేశాలు అందటంతో స్థానిక ఐకెపిఎస్ నాయకులు, మండల ప్రజలు నాగిరెడ్డి పల్లె పంచాయతీ పరిధిలోని ప్రధాన కూడలిలో ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ మైనార్టీ కమిషన్ ఆంధ్రప్రదేశ్ సలహాదారులు షబ్బీర్ అహమ్మద్, ఐకెపిఎస్ అధ్యక్షులు పోతురాజు మస్తానయ్యలు మాట్లాడుతూ నందలూరు ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో రైళ్లు నిలుపుదల కోసం అనేక ఉద్యమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. నందలూరు రైల్వే కేంద్రంలో రైళ్ళను నిలుపుదల చేయాలంటూ మండల వ్యాప్తంగా ప్రజల నుండి సేకరించిన సంతకాలతో కూడిన అభ్యర్థన పత్రాలను గత కొద్ది రోజుల క్రితం సాయి లోకేష్ కు అందించామన్నారు. వెంటనే సాయి లోకేష్ ఢిల్లీకి వెళ్లి రైల్వే మంత్రిత్వ శాఖతో మాట్లాడి నందలూరు, ఓబులవారిపల్లి రైల్వే స్టేషన్లలో గతంలో నిలుపుదల చేస్తున్న విధంగానే నిలుపుదల చేయాలని, సేకరించిన సంతకాల అభ్యర్థన పత్రాలను అందజేశారని అన్నారు. నందలూరు రైల్వే విశిష్టతను వివరించడంతో రైల్వే మంత్రి, రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వికాస్ జైన్, జాయింట్ డైరెక్టర్ రవి, దేవేంద్ర కుమార్‌లు వెంటనే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ అధికారులు రైళ్లు నిలుపుదల ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ముంగి సుబ్బరాయుడు, విఠలాచార్య, శివారెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఎంపిటిసి బీమా మునస్వామి, అరిగే హరిబాబు, అభిషేక్, డేవిడ్ కళ్యాణ్ రాజ్, ఆర్ముగం విశ్వనాథ్, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఎపిఒగా అంజనప్ప

తంబళ్లపల్లి : మండలంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం ఎపిఒగా అంజనప్ప బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కెవిపల్లె ఎపిఒగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాలలో ఉపాధి హామీ పనులు కల్పించేందుకు చొరవ చూపుతానని తెలిపారు.

నీట్‌లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-సుండుపల్లె

జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్‌లో మండలంలోని పలువురు విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఉత్తమ ర్యాంకులు సాధించారు. మండల టిడిపి నాయకులు తిమ్మసముద్రంకు చెందిన తాతినేని శివకుమార్ నాయుడు సోదరుడు తాతినేని సుబ్రమణ్య ప్రసాద్ కుమార్తె ప్రణవి 720మార్కులకు గాను 653 లతో జాతీయ స్థాయిలో 6193వ ర్యాంక్ కైవసం చేసుకుని సత్తా చాటారు.పెద్ద బలిజ పల్లెకు చెందిన నంద్యాల సిద్దయ్య కుమారుడు వంశీ 600 మార్కులతో జనరల్ విభాగంలో 28651, ఇడబ్ల్యూఎస్ విభాగంలో 3693 ర్యాంకులు సాధించారు. లగిసెట్టిపల్లెకు చెందిన చలపతి కుమారుడు కార్తీక్ 588 మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 36131ర్యాంకు, చెన్నంశెట్టిపల్లెకు చెందిన దేవరాజ్ కుమార్తె కల్యాణి 566, యల్లంపల్లెకు చెందిన రెడ్డిచర్ల రామచంద్ర కుమార్తె నందిని 581మార్కులు సాధించారు. నీట్‌లో ప్రతిభ చాటిన కార్తీక్, వంశీ, కళ్యాణి, నందినిలు సుండుపల్లె లిటిల్ ఫ్లవర్ పాటశాల పూర్వ విద్యార్థులు కావడంతో ఆ పాటశాల కరస్పాండెట్ నాగేశ్వరరావు విద్యార్థులను అభినందించారు. **పుల్లంపేట :** నీట్ పీజీ ఫలితాల్లో రైతు బిడ్డ ప్రతిభ చూపారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. మండల కేంద్రమైన పుల్లంపేట గ్రామానికి చెందిన ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి కుమారుడు ఆకేపాటి పవన్ తేజేశ్వర్‌రెడ్డి ఎంబిబిఎస్ చేయాలన్న సంకల్పంతో నీట్ పరీక్షలు రాయగా 720 మార్కులకు 615 సాధించాడు. తండ్రి గ్రామ సర్పంచ్ రైతు బిడ్డ కావడం విశేషం. ఆల్ ఇండియా స్థాయిలో 20433 ర్యాంక్ వచ్చింది. పేద ప్రజలకి వైద్యం అందించాలన్నదే తమ లక్ష్యమని తెలపారు. భవిష్యత్తులో కార్డియాలజిస్ట్‌గా పేదలకు సేవ చేయాలన్నదే లక్ష్యమని పవన్ తేజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

హుండీ ఆదాయం రూ.19.17 లక్షలు

నందలూరు : ఉమ్మడి కడపజిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీసౌమ్యనాధుని హుండీ ఆదాయం రూ.19,71,100లు వచ్చినట్లు టిటిడి డిప్యూటీ ఇఒ నతేష్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ నెలలో ఆలయం టిటిడి ఆధీనంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు ఇంత ఆదాయం వచ్చిందన్నారు. ఈ నగదును స్థానిక బ్యాంకులలో ఆలయ అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశయ్య, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ దిలీప్ కుమార్, ఆలయ ప్రధాన పూజారి సునీల్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

అంగన్వాడీ ఆయాలకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

టి.సుండుపల్లి మండలంలో అంగన్వాడీ ఆయా పోస్టులకు ఎంపికైన మహిళలకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి నియామక పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ అంగన్వాడీ కేంద్రాలలో చదువుకుంటున్న పిల్లలను తమ పిల్లలుగా భావించి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహా రాన్ని తప్పనిసరిగా పిల్లలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి దుర్గాప్రతాప్ నాయుడు, ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, భీమ రాజు, దొరబాబు పాల్గొన్నారు.

గంగనేరు చెరువులో చేపల వేలం పాట

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగనేరు సమీపంలో ఉన్న గంగనేరు ప్రాజెక్టును చేపల చెరువు వేలంపాటకు మత్స్యశాఖ అధికారి మోహనకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం చేపల వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలం పాటలో ఐదుగురు పాట పాడగా అందులో ఎ.నాగప్రసాద్‌రెడ్డి లక్ష రూపాయలకు వేలం పాటపాడి దక్కించుకున్నారు.2023 జులై1 నుంచి 2024 జూన్ 30 వరకు కాల పరిమితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశాఖ అధికారి రామాంజనేయులునాయక్, గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రటరీ బిందు, పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపిడిఒ తనిఖీ

రామాపురం : మండలంలోని చిట్లూరు హసనాపురం, నల్లగుట్టపల్లి, కొత్తపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం ఎంపిడిఒ హైదర్‌వలి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్క సచివాలయ ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. సచివాలయానికి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్టాపన

-హాజరైన ఎమ్మెల్యే, జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి :రాజంపేటరూరల్

రాజంపేట పట్టణం మన్నూరు అరుంధతి వాడలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో బుధవారం వైభవంగా సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం మంత్రోచ్ఛరణాలు మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు శ్రీ సీతారామ స్వామివారి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు రాముయాదవ్, యోగేశ్వర్‌రెడ్డి, కుండ్లరమణారెడ్డి, ఆలయకమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎంపియుపి స్కూల్ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-నందులూరు

మండలంలోని చెన్నయ్యగారిపల్లెలో కొత్తగా నిర్మించిన ఎంపియుపి స్కూల్ నూతన భవనం, రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఎంపిపి మేడా విజయ భాస్కర్ రెడ్డి ప్రారం భించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గడికోట ఉష సుబ్బారెడ్డి, ఎంఇఒ గంగిరెడ్డి, ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మాజీ ఎంపిపి భువన, బోయిన లక్ష్మీ నరసయ్య, ఓర్స్ శ్రీను, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి

ప్రజలకు అందుబాటులో ఉండాలి : డిపిఒ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని అన్ని సచివాలయం పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తమ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని డిపిఒ ధనలక్ష్మి, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె వెలిగల్లు పంచాయతీలో సచివాలయంను చెత్త నుంచి సంపద తయారు కేంద్రాన్ని, అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అనతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో ప్రతి కార్యదర్శి ఇంటి పన్ను, వసూళ్లు చేయాలని, పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. నెలకు ఒక్కసారి పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకులు 0 నుంచి 6 సంవత్సరాలు పిల్లలుకు, గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్‌రావు, ఇఒపిఆర్‌డి జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు జగన్, ఖాదర్‌బాషా, శైలజ, అయేషా, రెడ్డిప్రసాద్, సోమశేఖర్, బాలాజీ, ప్రసన్న లక్ష్మీ, ఓబులమ్మ, ప్రసాద్ నాయక్, రెడ్డి మొహ్మద్, శేషాద్రి పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డిపిఒ ధనలక్ష్మి

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నీలకంఠరావుపేట చెందిన పఠాన్‌ఖలీద్(34) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే రామాపురం మండలం నీలకంఠరావుపేట చెందిన పఠాన్ ఖలీద్ కూలీ పని చేసుకునేవారు. ప్రతిరోజు మాదిరిగానే బుధవారం అదే గ్రామంలోని సయ్యద్‌ఖాన్ ఇంటి నిర్మాణం కోసం బేల్దారు కూలీ పనికి వెళ్ళాడు. అక్కడ పనిచేస్తుండగా నాలుగు సంవత్సరాల క్రితం ఇంటి పైన విద్యుత్తు వైరుకు కట్టే కట్టి కడ్డీ కట్టడం వల్ల కడ్డీకి కరెంటు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృత దేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్ తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.